

మిరాలం చెరువుకు మహర్దశ

మిగతా 3లో..

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం, 28 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ కదనభేరి



వివరాలు 3లో..

# కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం

- జిందాల్ గ్లోబల్ వర్సిటీ ఆహ్వానం
- యూనివర్సిటీ వీసీ రాజ్‌కుమార్ లేఖ
- సమయం కేటాయించాలని ప్రత్యేక విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 27: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు మరో అరుదైన గౌరవం దక్కింది. తమ క్యాంపస్‌ను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించడంతోపాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని హర్యానాలోని ప్రముఖ ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఆహ్వానం పలికింది. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ సీ రాజ్‌కుమార్ కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టి సెప్టెంబర్, అక్టోబర్-2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని మిగతా 3లో..

# బీఆర్ఎస్ నేతలపై పోలీసుల దౌర్జన్యం..

- హరీశ్‌ను అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- హనుమకొండ కలెక్టరేట్ నుంచి పోలీస్ స్టేషన్ దాకా తోపులాట
- పాలిటెక్నిక్ కళాశాల గేట్లకు తాళం
- దాస్యం సహా నేతల గృహనిర్బంధం



వరంగల్, ఆగస్టు 27 : బీఆర్ఎస్ ఏ చిన్న నిరసన చేపట్టినా కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతున్నదా? పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్‌రావు హైదరాబాద్ మినహా రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ పర్యటించటానికి వీల్లేదు అన్నట్టు కక్షగట్టిందా? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే అంటున్నాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు గురువారం వరంగల్ పర్యటనపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరించిన వైఖరే అందుకు సాక్షీభూతంగా నిలుస్తున్నదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థుల ధర్నాకు సంఘీభావం తెలిపి, బాధ్యతాయుత ప్రతిపక్షంగా మిగతా 3లో..




"అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ... ప్రేమ, ఆప్యాయతలు జీవితాంతం నిలిచేలా చేసే పవిత్ర బంధం. రక్షాబంధన్ శుభాకాంక్షలు!

# తుమ్మిడిహెట్టిపై 1న ఢిల్లీలో కీలక భేటీ



- అధికారులకు దిశానిర్దేశం చేయనున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27: తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబరు 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల వనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సేవా భవన్‌లో జరిగే సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతర ప్రయత్నాల నేపథ్యంలోనే సీడబ్ల్యూసీ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 150 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టును నిర్మించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తున్న విషయం విదితమే. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కడితే... మళ్లీ పంపింగ్ చేసుకోవాల్సి ఉంటుందని, 150 మీటర్ల ఎత్తుతో అయితేనే గ్రావిటీ ద్వారా నీటిని తరలించవ్చని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనాల ప్రకారం 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కట్టినా.. అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్రం, మహారాష్ట్రతో రాష్ట్ర ప్రభుత్వం వరుసగా సంప్రదింపులు జరుపుతోంది. దాని ఫలితంగానే సెప్టెంబరు 1న కీలక సమావేశం ఢిల్లీలో జరగనుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించనున్నారు. నీటి లభ్యతతోపాటు ఇతరత్రా అంశాలపై సమీక్షించి, ఢిల్లీలో జరిగే సమావేశంలో అనుసరించాల్సిన విధానంపై అధికారులకు దిశా నిర్దేశనం చేయనున్నారు. అలాగే, కృష్ణా ట్రైబ్యునల్‌లో అనుసరించాల్సిన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్‌తో పాటు న్యాయవాదులతో సీఎం సమావేశం కానున్నారు. మిగతా 3లో..

# ఇవి పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

- 200 కేటాయిస్తూ జివో జారీచేసిన తెలంగాణ

హైదరాబాద్,ఆగస్ట్27 : ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటో రిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఇవిలుగా మార్చే ప్రక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# నేపాల్‌లో మహా జల విలయం



న్యూఢిల్లీ, ఆగస్టు 27: నేపాల్‌లో మహా జల విలయం సంభవించటానికి చైనా నిర్లక్ష్యమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. టిబెట్‌లో నెలకొన్న ప్రమాదకర పరిస్థితుల గురించి నేపాల్‌కు సకాలంలో చైనా సమాచారం ఇవ్వలేదనే వాదన వినిపిస్తోంది. బుధవారం సంభవించిన మెరుపు వరదలు నిమిషాల వ్యవ ధిలో త్రిశూలి, భోటెకోశీ, లెండేఖోలా నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలను తుడిచిపెట్టేశాయి. ఈ మహా విపత్తుకు చైనా నిర్లక్ష్యమే కారణమని నేపాల్ రాజకీయ నాయకులు, మీడియా దుమ్మెత్తిపోస్తున్నారు. 'భద్రత విషయంలో మా పొరుగుదేశాలతో మేము ఎప్పుడూ సమాచారం పంచుకుంటూనే ఉంటాం. అయి నప్పటికీ మా ఉత్తరభాగంలో ఉన్న దేశం (చైనా) మమ్మల్ని ఎప్పుడూ చులకనగానే చూడటం విచారకరం. భారీ ప్రకృతి విపత్తుల గురించి ఆ దేశం ముందస్తు సమాచారం ఇవ్వకపోవటం వల్లనే మేము తీవ్ర జన నష్టాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. అవసరం ఉన్నా.. లేకపోయినా వారి భద్రతకు మేము ప్రాధాన్యం ఇస్తున్నాం.. కానీ, వారి భూభాగంలో ఏర్పడే ప్రకృతి విపత్తులకు ఎప్పుడూ మేమే నష్టపోవాల్సి వస్తోంది. ఈ వన్‌సైడ్ ప్రేమ వల్ల నేపాల్ ఎందుకు మూల్యం చెల్లించాలి?' అని నేపాల్ దినపత్రిక 'నయా పత్రిక'కు చెందిన జర్నలిస్టు పర్శురామ్ కప్లే ఎక్స్‌లో ఆగ్రహం వ్యక్తంచేశారు.నేపాల్ నేతల విమర్శలను చైనా తిప్పికొట్టింది. ఈ ప్రకృతి విపత్తును తాము కూడా మిగతా 3లో..

# రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- అది పూర్తయ్యాక ప్రజల ముందుకు అక్రమాల చిట్టా
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 27: రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వేను పూర్తి చేసి.. రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని రెవెన్యూ, గృ హ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీ ని వా స రె డ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో గురువారం కల్లూరు, తల్లాడ మండలాల స్థాయి ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఖమ్మం కలెక్టర్ దివాకర, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రభుత్వం నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామ న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి వ్యవస్థ ద్వారా జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతోందన్నారు. అది పూర్తయ్యాక పేదల భూములు ఎలా అన్యాక్రాంతం అయ్యాయో.. ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు.. తదితర అన్ని అవకతవకల వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచబోతోందన్నారు. గత పాలకులు తమ ప్రభుత్వంపై రూ. 8.50లక్షల కోట్లు అప్పు భారం మోపినా.. పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ముందడుగు వేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి కుల, మత, పార్టీల తేడాల్లేకుండా దశల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామన్నారు. మిగతా 3లో..

# మేమంతా క్షేమంగా ఉన్నాం : సతీష్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27: భారీ వరదలతో నేపాల్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ వరదల వల్ల వంద మందికిపైగా మరణించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక వందలాది మంది గల్లంతయ్యారు. వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. ఆ జాబితాలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో భారత్‌లోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర కలత చెందుతున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగి వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు. ఆయన తాము క్షేమంగా ఉన్నామని, తాము వరదల్లో చిక్కుకోలేద న్నారు. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని తెలిపారు. తామంతా క్షేమంగా ఉన్నామని స్పష్టం చేశారు. 30న హైదరాబాద్ చేరుకుంటామని సతీష్ రెడ్డి చెప్పారు.

# ప్రజల అవసరాలే పరమావధిగా పాలన

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..



హైదరాబాద్, ఆగస్టు 27: తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మిగతా 3లో..

# ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

- అధిష్టానం తీసుకునే నిర్ణయం ఆందరికీ శిరోధార్యం
- కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్



నిజామాబాద్,ఆగస్ట్27 : మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# నకిలీ పురుగుమందుల విక్రయం



- సాధారణ నేరం కాదు : హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 27:** నకిలీ, మిస్ బ్రాండెడ్, గడువు ముగి సిన పురుగుమందుల విక్రయాన్ని సాధారణ నేరంగా పరిగణిం చలేమని హైకోర్టు స్పష్టం చేసింది. నకిలీ పురుగుమందుల విక్ర యం,నిల్వ, పంపిణీని అడ్డుకునేందుకు నిర్బంధ చట్టాన్ని వినియోగించడం సమర్థనీయమేనని తేల్చి చెప్పింది. ముద్దంగుల ఆది త్యను 'ఇన్‌సెక్టిసైడ్ అఫెండర్'గా పేరొంటూ 2025 సెప్టెంబర్ 8న జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన భార్య ఏర్లం అలియాస్ ముద్దంగుల అనురాధ దాఖలు చేసిన పిటిష న్‌ను జస్టిస్ మౌషుమీ భట్టాచార్య, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం కొట్టివేసింది. ఆదిత్య ఉత్తరప్రదేశ్ నుంచి తకువ ధరకు నకిలీ పురుగుమందులు తెప్పించి, వివిధ కంపెనీల పేర్లతో నకిలీ ఉత్పత్తులు తయారు చేసి ఏజెంట్ల ద్వారా రైతులకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయని కోర్టు పేరొన్నది.

# కొడుకు ఎదుటే తల్లిపై లైంగికదాడి..



- మక్తల్‌లో మద్యం మత్తులో ఇద్దరి దుర్మార్గం
- అడ్డుకొనేందుకు యత్నించిన బాలుడిపై దాడి

**హైదరాబాద్,మక్తల్, ఆగస్టు27 :** నారాయణపేట జిల్లా మక్త ల్‌లో దారుణం చోటుచేసుకున్నది. ఒంటరిగా నిద్రిస్తున్న మహి ళపై ఆమె కన్నకొడుకు ఎదుటే మద్యం మత్తులో ఉన్న ఇద్దరు దుండగులు లైంగికదాడికి పాల్పడ్డారు. అడ్డుకొనేందుకు యత్నించిన ఆ బాలుడిపైనా దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగని ఆ దుర్మార్గులు బాధిత మహిళ రహస్యాంగాలు కోసి రాక్షసంగా ప్రవర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మక్తల్ పట్ట ణంలో ఓ మహిళ పదేండ్లుగా తన 12 ఏండ్ల కొడుకుతో కలిసి ఉంటున్నది. జీవనోపాధి కోసం యాచకురాలిగా ప్రధాన కూడలి తోపాటు బస్ స్టాండ్ వద్ద తిరుగుతుండేది. రాత్రి సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో తలదాచుకుంటున్నది. గురువారం కూడా అదే భవనంలో తలదాచుకున్నది.

# పీఆర్సీ అమలు చేయాలి




**హైదరాబాద్,ఆగస్టు 27:** పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, 2వ పీఆర్సీని అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆబ్కారీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం ఉద్యోగులు ఆబ్కారీ భవన్ నుంచి ఇందిరాపార్క్ వరకు నిరసన ర్యాలీ చేపట్టా రు. ఈ ర్యాలీలో తెలంగాణ ఉద్యమం తరువాత ఆబ్కారీ చరిత్ర లోనే తొలిసారిగా యూనిఫామ్ సర్వీసెస్ కిందకు వచ్చే సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు సైతం పాల్గొని తమ హక్కులసాధనకోసంగొంతెత్తారు.కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ లక్ష్మణ్‌గౌడ్, కార్యదర్శి చంద్రశేఖర్, తెలం గాణ స్టేట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర కృష్ణ, టీఎన్జీవోస్ మీడియాఇన్‌చార్జ్ మహేందర్‌రావు పటేల్ పాల్గొన్నారు.

# భూగర్భ గనుల శాఖ డీడీ ఇంట్లో ఏసీబీ సోదాలు

## రూ.3 కోట్ల అక్రమ ఆస్తులున్నట్లు గుర్తింపు



**హైదరాబాద్, ఆగస్టు 27:** అక్రమ ఆస్తుల ఆరోపణలపై వరంగల్ భూగర్భ, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ బొజ్జ జయ రాజ్ ఇంటిపై గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు రూ.3 కోట్ల ఆరు లక్షల అక్రమ ఆస్తులున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా , ఎఫ్ఏసీగా వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఆయన పనిచేస్తున్నారు.సిటీ గైడ్లు అన్వేషించడంబొజ్జ జయరాజ్‌పై అనేక అవినీతి,ఆరోపణలు రావడంతో అతనికి సంబంధించిన 8 మంది బంధువుల ఇంట్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు ప్రకటనలో వెల్లడించారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ -2 భవనం, కేపీహెచ్‌బీలో ఒక ప్లాట్, కీసన, తుంగతుర్తి, తుప్రాన్, సూర్యపేటలో ఐదు ప్లాట్లు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి, , రూ.10 లక్షల నగదు , బంగారం, బ్యాంక్ డిపాజిట్లు, బ్యాంక్ బ్యాలెన్స్ మొత్తం కలిపి రూ.3.06 కోట్లు ఉన్నట్లు గుర్తించామని వివరించారు.వీటి మార్కెట్ విలువ మరింత అధనంగా ఉంటుందని వెల్లడించారు. అదేవిధంగా డీడీ జయరాజ్‌కు చెందిన డ్రైవర్ సత్తునూరి యాదయ్య సెల్‌ఫోన్‌ను పరిశీలించగా అతడి ఖాతా నుంచి కూతురు ఖాతాకు 24.8 లక్షలు బదిలీ అయినట్లు గుర్తించినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాలో సంపాదించినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.

# మీర్ ఆలం చెరువుకు కొత్త హంగులు

- ఫ్యామిలీ టూరిస్టు హబ్ గా అభివృద్ధి..ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు



**హైదరాబాద్, ఆగస్టు 27:** చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు కల్పించాలని యోచిస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మీర్ ఆలం చెరువును గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సందర్శన సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణా ళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూ రాఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోదం, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారని తెలిపారు.

# నేపాల్‌లో చిక్కుకున్న 23 మంది తెలంగాణవాసులు

- వారి భద్రత కోసం ప్రత్యేక చర్యలు
- కేంద్ర ప్రభుత్వానికి వివరాలను పంపించాం
- న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్, సచివాలయంలో హెల్ప్‌లైన్
- కుటుంబ సభ్యులు ఆందోళన చెందొద్దు : మంత్రి పొంగులేటి ప్రపంచ మ్యాప్‌లు పరిశీలించడం



**హైదరాబాద్, ఆగస్టు 27:** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణకు చెందిన పర్యాటకులు, యాత్రికులు, ఇతర పౌరుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు అందించిన సమాచారం ఆధా రంగా ప్రాథమికంగా నేపాల్‌లో 23 మంది తెలంగాణవాసులు చిక్కుకున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. నేపాల్ పరిస్థితులపై గురువారం మంత్రి పొంగులేటి విపత్తు నిర్వహణశాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుర్తించిన వారి వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు పంపించామని తెలిపారు. వారి ప్రస్తుత పరిస్థితి, ఆచూకీ తెలుసుకోవడంతోపాటు అవసరమైన సహాయం అందించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ, కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేస్తోందని తెలిపారు. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సాధారణ పరిపాలన శాఖ (ఎన్ఆర్ఐ విభాగం) ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, బాధితుల కుటుంబాల నుంచి సమాచారం సేకరించి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నామని వెల్లడించారు. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఇంకా ఎవరైనా తెలంగాణ వాసులు నేపాల్‌లో చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వానికి సమాచారం అందించాలని కోరారు. బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నెంబర్, నేపాల్‌లో చివరిగా ఉన్న ప్రదేశం, ట్రావెల్/టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు నెంబర్లు అందించాలని సూచించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని వివరించారు.పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి, రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరి భద్రతకు అవసరమైన సహాయాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. నేపాల్‌లో చోటుచేసుకున్న విషాదకర పరిస్థితులపై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విపత్తులో చిక్కుకున్న తెలంగాణ ప్రజలకు సాధ్యమైనంత త్వరగా సహాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. నేపాల్‌లో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

# హైదరాబాద్ ఎన్‌ఎఫ్‌సీలో 432 అప్రెంటిస్ ఖాళీలు




**హైదరాబాద్, ఆగస్టు 27:** హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ 432 ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులు, ఆసక్తి ఉన్న అభ్య ర్థులు సెప్టెంబర్ 16 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎన్‌ఎఫ్‌సీ భారత ప్రభుత్వ అణుశక్తి శాఖకు చెందిన సంస్థ.ఖాళీల వివరా లు..ఐటీఐ ట్రేడ్ 432 ఖాళీలను ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్,కెమికల్ ప్లాంట్ ఆపరేటర్, మెకానిక్, మోటార్ మెకా నిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ , కార్పెంటర్, ప్లంబర్, వెల్డర్ తదితర విభాగాల్లో నింపుతారు. అర్హతలు..పదో తరగతితో ఉత్తీర్ణతో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐఉత్తీర్ణులైఉండాలి.18 నుంచి 27 ఏండ్ల వయసు ఉండాలి.ఎంపిక..రాత పరీక్ష ఉండదు. నిర్దేశించిన ఎంపిక ప్రక్రియ ఆధారంగా ఉంటుంది. అంటే ఇంటర్వ్యూ లేదా మెరిట్ ఆధా రంగా ఎంపిక చేయవచ్చు. ఎంపికైన వారికి ఏడాది ట్రైనింగ్ ఉంటుంది. వీరికి నెలకు రూ. 10,560 నుంచి 11,040 వరకు ఇస్తారు. దరఖాస్తులు www.apprentic eshipindia. gov.in పోర్టల్ ద్వారా చేసుకోవాలి. అవసరమైన సర్టిఫికెట్‌లను ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటికి దరఖాస్తు చేసుకోవాడానికి చివరితేదీ సెప్టెంబర్ 16. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.nfc.gov.in చూడండి.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా 5,000 ప్రత్యేక బస్సులు..

- రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు: మంత్రి పొన్నం



**హైదరాబాద్, ఆగస్టు 27:** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 27 గురువారం నుంచి ఆగస్టు 31 సోమవారం వరకు ప్రయాణికుల సౌకర్యార్థం 5,000 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.తెలంగాణ ఆగస్టు 26న మిలాద్-ఉన్-నబీ, ఆగస్టు 28న రాఖీ పౌర్ణమి, ఆగస్టు 30న ఆదివారం సెలవు రావడంతో పండుగకు ముందే ప్రయాణికుల రద్దీ ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. అలాగే తిరుగు ప్రయాణాల రద్దీ ఆగస్టు 30 ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆగస్టు 31 సోమవారం వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు. గత ఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా 4,760 ప్రత్యేక బస్సులను నడిపించగా, ఈ ఏడాది ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 240 బస్సులను అదనంగా పెంచి మొత్తం 5,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.గత ఏడాది ప్రత్యేక బస్సుల ద్వారా సుమారు 3.68 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించగా, అందులో 2.51 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కూడా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ ఉన్న ప్రాంతాలకు అదనపు బస్సులను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రాఖీ పౌర్ణమి, తిరుగు ప్రయాణాల రద్దీ నేపథ్యంలో అవసరమైన చోట అదనపు బస్సులను నడపడంతో పాటు ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు పర్య వేక్షించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మహిళా ప్రయాణికులకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. పండుగ రద్దీ సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు సమష్టిగా, ఓర్పుతో విధులు నిర్వహిస్తూ ప్రయా ణికులకు మెరుగైన సేవలు అందించాలని సూచిం చారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణించేలా టీజీఎస్ఆర్టీసీ అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను వినియోగిం చుకుని సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

బలగం BALAGAM TV
balagamtv100@gmail.com

# (మొదటిపేజీ తరువాయి)

## బీఆర్ఎస్ నేతలపై పోలీసుల దౌర్జన్యం..

వారికి అండగా నిలిచేందుకు తాను వస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రకటించినప్పటి నుంచి ఇటు వరంగల్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రాంగణాన్ని, బీఆర్ఎస్ ముఖ్యనేతల ఇండ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.మొదట మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సహా అనేక మంది బీఆర్ఎస్ నేతలను పోలీసులు గృహనిర్బంధం చేసి ఆ తరువాత పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పార్టీ నేత ఇంట్లో జరిగే పెండ్లికి హాజరయ్యేందుకు హరీశ్‌రావు వస్తున్నారని రూఢీ చేసుకున్న తరువాత పోలీసులు వినయ్‌భాస్కర్‌ను విడిచిపెట్టారు. పార్టీ నాయకుడు నార్లగిరి రమేశ్ కుమారుడి వివాహానికి హాజరైన అనంతరం అక్కడి నుంచి బీఆర్ఎస్ కార్యాలయానికి వెళ్లేందుకు వస్తున్న క్రమంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద టీఎన్జీవో నిరసన చేపట్టింది. పెండ్లిలో కలిసిన ఉద్యోగులు.. హరీశ్‌రావును తమ శిబిరానికి ఆహ్వానించారు. ఈ క్రమంలో ఆయన హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన కార్యక్రమంలో పాల్గొని వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. హరీశ్‌రావు ప్రసంగం పూర్తి కావస్తుండనగానే ప్రాంగణం చుట్టూ వందలాది పోలీసులు చేరిపోయారు. హనుమకొండ కలెక్టరేట్ ముందు ఉద్యోగుల ధర్నాకు హరీశ్‌రావు సంఘీభావం తెలుపుతున్న క్రమంలోనే టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, ఏఆర్, స్పెషల్ పార్టీ, ఇంటెలిజెన్స్ బలగాలు భారీ ఎత్తున వేదిక ప్రాంగణాన్ని చుట్టుముట్టాయి. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపి, అక్కడి నుంచి వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు మద్దతు ప్రకటించడానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి హరీశ్‌రావు వెళ్తారనే ఉద్దేశంతో పోలీసులు ఆయన్ను చుట్టుముట్టారు. పోలీసుల తీరును హరీశ్‌రావు తీవ్రంగా ఆక్షేపించారు. తమ పార్టీ కార్యాలయానికి వెళ్లనీయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పోలీసులను కోరారు.ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలను తప్పిస్తూ పోలీసులు హరీశ్‌రావు సహా పార్టీ ముఖ్యనేతలను తమ వలయంలోకి తీసుకున్నారు. మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, టీ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు మర్రి యాదవరెడ్డి, గోసుల శ్రీనివాస యాదవ్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, జోరిక రమేశ్ పోలీసుల తీరుపై మండిపడ్డారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకున్నది. ఎక్కడిక్కడ పార్టీ శ్రేణులను అడ్డుకోవటమే కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలను అక్కడి నుంచి నుంచి వ్యూహాత్మకంగా దూరం చేయటం ప్రారంభించారు.మరోవైపు నాయకులు, కార్యకర్తలు సైతం అందుకు దీటుగా పోలీసుల వ్యూహాన్ని ఛేదించేందుకు ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాటతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. భారీ ఎత్తున చేరుకున్న పోలీసులు హరీశ్‌రావును అరెస్ట్ చేసి, తమ వాహనంలోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. పోలీసుల వ్యూహాన్ని గమనించిన హరీశ్‌రావు మెరుపు వేగంతో పోలీసుల తీరుకు నిరసనగా తాను కాలినడకన పోలీసు స్టేషన్‌కు వస్తానని ప్రకటించారు. ఇందుకు పోలీసులు ససేమిరా అన్నా సరే వారి వలయం నుంచి తప్పించుకొని ఆయన అక్కడి నుంచి నడక ప్రారంభించటంతో గులాబీ శ్రేణులు ఆయన్ను అనుసరించారు. చేసేదేమీలేక సుబేదారి పోలీసు స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి సహా పార్టీ నేతలను అరెస్టు చేశారు.

## కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం

తెలియజేశారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీలో నెలకొల్పిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీ సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఈ మ్యూజియంలో రాజ్యాంగ నిర్మాణ సమయంలో ఎదురైన పోరాటాలు, సవాళ్లు, రాజ్యాంగ నిర్మాతల కృషిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలు పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తంచేశాయి. యూనివర్సిటీ విద్యార్థులతో పాటు అధ్యాపకులతో సంభాషించేందుకు ఆహ్వానం పంపినందుకు కేటీఆర్ ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులతో సంభాషించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, యూనివర్సిటీ పంపిన ఆహ్వానం మేరకు కచ్చితంగా హాజరవుతానని తెలిపారు.

### అంతర్జాతీయ స్థాయిలో యూనివర్సిటీకి గుర్తింపు

2009లో స్థాపించిన జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ప్రస్తుతం దేశంలోని ప్రముఖ బహుళ విభాగాల, పరిశోధనాధారిత విద్యాసంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇకడ 16 వేల మందికిపైగా విద్యార్థులు, 1,100 మందికిపైగా పూర్తిస్థాయి అధ్యాపకులు ఉన్నారు. 50కిపైగా దేశాలకు చెందిన అధ్యాపకులు, 160 దేశాలకు చెందిన విద్యార్థులతో అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ విశ్వవిద్యాలయం, ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల్లోని 600కుపైగా ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యాలు కలిగి ఉన్నది.జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆన్‌లైన్ లెర్నింగ్ ర్యాంకింగ్స్2024లో గోల్డ్ రేటింగ్ పొందడంతోపాటు, క్యూఎస్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో వివిధ విభాగాల్లో ప్రముఖ స్థానాలు దకించుకున్నది. 2020లో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నుంచి 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్' హోదాను కూడా పొందింది.

## నేపాల్‌లో మహా జల విలయం



గుర్తించలేకపోయామని గురువారం పేర్కొంది. విపత్తుల గురించి నేపాల్‌కు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూనే ఉన్నామని చైనా విదేశాంగశాఖ వెల్లడించింది. భోటెకోశీ నదిలో ఇంకా ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని తెలిపింది.

## ప్రజల అవసరాలే పరమావధిగా పాలన

చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## రెండోదశ భూ సమీకరణ రైతులకు రుణమాఫీ

- మంగళగిరికి కూడా అమరావతి నుంచే నీరు
- సిఆర్‌డిఎ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి నారాయణ




అమరావతి,ఆగస్ట్27 : మంగళగిరికి రాజధాని అమరావతి నుంచి తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 65వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న వివిధ పరిపాలన అనుమతులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను మంత్రి నారాయణ వివరించారు. 06.01.2026 ముందు వరకూ లోన్లు తీసుకున్న రెండో దశ భూసమీకరణ రైతులకు కూడా రుణ మాఫీ వర్తింప చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ వివరించారు. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్‌కు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి చెప్పారు. మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29 గ్రామాల లే ఔట్ రోడ్లు బీటీగా మార్చేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా అంగీకారం తెలిపామని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐవోసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ కదనభేరి..

### సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు నిరసనలు




హైదరాబాద్, ఆగస్టు 27 : కాంగ్రెస్ వెయ్యి రోజుల మోసపూరిత పాలనపై బీఆర్ఎస్ కదనభేరి మోగించనున్నది. అలవికాని హామీలిచ్చి అమలుచేయకుండా దగా చేసిన సర్కార్‌పై పోరుబాటకు సిద్ధమైంది. అందులో భాగంగా సెప్టెంబర్ 1న ప్రభుత్వంపై చార్జ్‌షీట్‌తో మొదలు 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టనున్నది. ఈ మేరకు ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రకటించగా, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మోసపూరిత రేవంత్ సర్కార్ తీరును ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ హోం మంత్రి మహమూ ద్ అలీ, విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, వై సతీశ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, పార్టీ నేత కిశోర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇది తెలంగాణ ప్రజల సర్కార్ కాదు.. ముమ్మాటికీ ఆంధ్రా ప్రయోజ నాలకు కొమ్ముకాసే బానిస సర్కార్' అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్ర జాపాలన పేరిట దగా పాలన చేస్తున్నదని దుయ్యబట్టారు.వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ లు అమలుచేస్తామని గ్యారెంటీ కార్డులు పంచి న కాంగ్రెస్, వెయ్యి రోజులైనా అమలు చేయకుండా దారుణంగా వంచిస్తున్నదని మండిపడ్డారు.సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గేను తీసుకు వచ్చి ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరే షన్ల పేరిట హామీలిచ్చిన విషయాన్ని గు ర్తుచేశారు. కానీ సెప్టెంబర్ 2న నాటికి వెయ్యి రోజులు పూర్తయినా అమల్లో చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. 'హామీలు అమలు చేయ లేదని మేధావులు, ఆర్థికవేత్తలు, జర్నలిస్టులు ప్రశ్ని స్తే.. మాది వందేండ్ల పార్టీ అని, అపార అనుభవం ఉన్నదని రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క గొప్పలు చెప్పారు.. ఇదిగో గ్యారెంటీ కార్డు' అని ప్రగల్భాలు పలికారంటూ నిప్పలు చెరిగారు. ఇప్పుడేమో అప్పులు, ఆర్థిక పరిస్థితి బాగాలేదని సాకులు చెబుతూ తప్పించుకు తిరుగుతున్నారని దుయ్యబట్టారు.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



న్యూఢిల్లీ,ఆగస్ట్27 : లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పా టు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## మైనింగ్ ఎడి జయరాజు ఇళ్లపై ఎసిబి దాడులు

### భారీగా నగదు, నగలు స్వాధీనం

హైదరాబాద్, ఆగస్టు 27 : భాగ్యనగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు మొదలయ్యాయి. భూపాలపల్లితో పాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు ప్రాంతాల్లోని 8 చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. సోదాల్లో జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదు, బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్, ల్యాండ్ డాక్యుమెంట్లను గుర్తించి.. పరిశీలిస్తున్నారు. బ్యాంకులో రూ.60 లక్షల నగదు ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే రెండు కార్లు, రెండు బైక్‌లు, జనగామలో ఐదు ఎకరాల భూమి ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. సోదాలపై ఏబీసీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ మాట్లాడుతూ.. భూగర్భ జల గనుల శాఖ ఏడీ జయరాజు నివాసంలో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయం నుంచి జరుగుతున్న సోదాల్లో నలభై తులాల బంగారాన్ని గుర్తించామన్నారు. జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు ఆయన బ్యాంకు ఖాతాలో నగదును కూడా గుర్తించామని చెప్పారు. జనగామలో జయరాజుకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని.. ఆయ నపై ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోనే నాలుగు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయని సాయి మనోహర్ తెలిపారు. తాండూరు, వరంగల్‌లోని జయరాజ్ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు జరుగుతున్నాయని అన్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్‌తో పాటు రెండు కార్లు, రెండు బైక్‌లను కూడా గుర్తించామన్నారు. సాయంత్రం వరకు సోదాలు కొనసాగుతాయని.. సోదాల అనంతరం ఆయన అక్రమాస్తులపై క్లారిటీ వస్తుందని వెల్లడించారు. జయరాజ్ ఇటీవలే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతు న్న కొందరితో జయరాజ్ కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు గతంలో అనేకసార్లు వెళ్లువెత్తాయి. ఈ వ్యవహారంలో అక్రమంగా ఆస్తులు కూడబెట్టరా..? అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

### వేముల ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 27 : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, 'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కు తా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బొర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్నపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు.

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

- 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు
- వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్27 : దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్- మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.

## ఖేలో ఇండియా సంవాద్

### దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

### క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ, ఆగస్టు 27 : దేశ యువత, క్రీడాకా రులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు
- తోణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు

పల్నాడు,ఆగస్ట్27 : పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట



ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు.

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారిపై ఆరా

### ఎపి వాసుల క్షేమంపై నారా లోకేశ్ సమీక్ష

అమరావతి,ఆగస్ట్27 : నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమ సమాచారాలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నేపాల్‌ల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల గురించి అడిగి తెలుసుకున్నారు. నలుగురు సురక్షితంగా ఉన్నారని.. మరో ముగ్గురి ఆచూకీ లభ్యం కాలేదని మంత్రికి ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు తెలియజేశారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మిల ఆచూకీ లభించలేదని వెల్లడించారు. కనిపించకుండా పోయిన ముగ్గురి ఆచూకీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేశ్ సూచించారు. చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా కనిపించినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు.. కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా.. క్షేమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని మంత్రి లోకేశ్ సూచనలు చేశారు. నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులు, మానస సరోవర్ యాత్రకు వెళ్లిన ఏపీ వాసుల సమాచారాన్ని ఆర్టీజీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## ఫోన్ వాడొద్దన్న తండ్రి..బాలిక ఆత్మహత్య

హైదరాబాద్,ఆగస్ట్27 : తండ్రి మందలించాడనే మనస్తాపంతో ఓ బాలిక కఠిన నిర్ణయం తీసుకుంది. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ప్రాణాలు తీసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడకు చెందిన ఓ బాలిక అస్తమానం ఫోన్‌లో గడిపేది. ఇది గమనించిన తండ్రి.. పలుమార్లు ఆమెను మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలిక.. ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత గురువారం ఉదయం ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో శవమై తేలింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే బాలిక వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## హన్మకొండలో బిఆర్ఎస్ ధర్నా



### హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు



వరంగల్,ఆగస్ట్27 : బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా

- జగన్ దుర్నీతి వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేకుండా పోయాయి
- గత వైఫల్యాలను కప్పిపుచ్చి మాట్లాడడం విడ్డూరంగా ఉంది
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

విశాఖపట్నం,ఆగస్ట్27 : ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం దెబ్బతినడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగనే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆ రోజు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే.. నేడు ఎల్ నినో వచ్చినా సరే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. గురువారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తు కంటే అతి పెద్ద విపత్తు గొడ్డలి పార్టీ అని అభివర్ణించారు. ఎల్ నినో కంటే పెద్ద విపత్తు వైఎస్ జగన్ అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులు గాడిలో పెట్టామని తెలిపారు. ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్.. తన పాలనను గుర్తుపెట్టుకోకుండా మాట్లాడడం బాధగా ఉందన్నారు. ఎల్ నినో పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల పట్ల ప్రేమ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని వైసీపీ అధినేత జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. సభలో అన్నింటికీ సమాధానాలు చెబుతామని పేర్కొన్నారు. సెంబ్లీకి వస్తే ఐదేళ్లలో చేసిన అన్యాయాలను నిలబెట్టి.. చెబుతామంటూ జగన్‌కు స్పష్టం చేశారు. క్రిమినల్ ముసుగులో ఓ రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఇలా ఉన్నాడని.. లేకుంటే ఎక్కడ ఉండే వాడో కూడా తెలియదని జగన్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. రెడ్ బుక్ ఇంప్లిమెంట్ చేస్తే.. ఎవరైనా ఉంటారా? అని వైసీపీ అధినేతను సూటిగా ప్రశ్నించారు. తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మ వద్ద కక్ష సాధింపులు ఉండవని కుండబద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో బలహీన వర్గాలపై దమనకాండకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన మాయ మాటలు బీసీలు నమ్మరని అన్నారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ని తగ్గించింది జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టీడీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందని అన్నారు. కానీ వైసీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందా? అని వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం తాము బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని చూస్తే.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్‌పై అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను భయపెట్టి, ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అయితే సీట్లు ఇవ్వనంటూ భయపెడుతున్నారని ఆరోపించారు. తిరిగి ఎన్నికలు సాఫీగా జరిగితే తామే గెలుస్తామని వైఎస్ జగన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. గొడ్డలి పార్టీ అధినేత ప్రతి పది రోజులకు ఓ సారి ప్రెస్ మీట్ పెట్టి అబద్ధాలను అలవోకగా చెప్పేస్తున్నాడంటూ మంత్రి అచ్చెన్నాయుడు వ్యంగ్యంగా అన్నారు. దీనిని ప్రతి ఒక్కరు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. అయినా దీనిని జగన్ ఆపడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కూటమి పార్టీపై బురద చల్లడం జగన్‌కు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చెప్పే అబద్ధాలను ఎవరైనా నమ్ముతారేమోనని.. ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే తాము ముందుకు వస్తున్నామని అచ్చెన్నాయుడు వివరించారు.

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు



- 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు
- కన్నీటి పర్యంతం అయిని జగ్గీవాసుదేవ్

చెన్నై,ఆగస్ట్27 : ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటి వరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజ్ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

## రాజధాని గ్రామాల్లో1437 కోట్ల రూ.లతో మౌలిక సదుపాయాల కల్పన

- లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్ఆర్ భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లు
- మంగళగిరి పట్టణానికి రోజుకు 30 ఎంఎల్డీ త్రాగునీరు సరఫరా
- రాజధాని గ్రామాలకు సైతం ఇకపై రోజుకు 135 లీటర్లు త్రాగునీరు సరఫరా
- మంత్రి పొంగూరు నారాయణ



అమరావతి,ఆగస్టు27 : రాజధాని గ్రామాల్లో రూ.1437 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు సిఆర్డిఏ అధారిటీ ఆమోదం తెలిపిందని రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు పొంగూరు నారాయణ చెప్పారు.గురువారం ఎపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 65వ సీఆర్డీఏ అథారిటీ సమవేశ వివరాలను ఆయన సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో రూ.596 కోట్లతో సెంట్రలైజ్డ్ పబ్లిక్ లైబ్రరీ,ఆడిటోరియం,హ్యూమన్ రిసోర్స్ భవనాలు నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందని తెలిపారు.ముఖ్యంగా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో క్రిటికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రేనేజీలు,మంచినీటి పైపులు, వీధి దీపాల ఏర్పాటుకు 1437 కోట్ల రూ.లకు అనుమతి ఇచ్చిందని వివరించారు.ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రోజుకు ఒక్కొక్కరికి 40 లీటర్లు నీరు అందిస్తుండగా లెక్కల ప్రకారం ఒక్కో వ్యక్తికి 135 లీటర్లు అందించాల్సి ఉందన్నారు.కావున ఆయా గ్రామాల్లో తాగు నీటి సరఫరా పైపు లైన్లు కూడా పూర్తిగా మార్చే ప్రతిపాధనకు సిఆర్డిఏ అధారిటీ ఆమోదించిందని తెలిపారు.ఆయా గ్రామాల గుండా వెళ్తున్న ట్రంక్ రోడ్లకు ల్యాండ్ టూ ల్యాండ్ ఇవ్వడానికి సైతం ఈ నిధులు వినియోగిస్తామని ఇందుకై మరో రూ.533 కోట్లు మంజూరు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.గతంలో ఈ 29 గ్రామాల్లో మౌలిక సౌకర్యాల నిమిత్తం విడుదల చేసిన రూ.904 కోట్లుతో కలిపి మొత్తం రూ.1437 కోట్లతో నూటికి నూరు శాతం మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు. రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లోనిలే అవుట్లలో రహదారులను గతంలో సీసీ రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది అయితే సీఆర్ఆర్ఐ న్యూఢిల్లీ,ఐఐటీ ఖరగ్ పూర్ ఆర్గనైజెషన్ లతో పరిశీలన చేయించగా 54 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రహదారులను సైతం సీసీ కాకుండా బీటీ రోడ్లుగా మర్చాలన్న అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగిందని మంత్రి నారాయణ చెప్పారు.నిపుణుల సలహా మేరకు ఆయా రహదారులను సైతం బీటీ రోడ్లుగా నిర్మించడానికి సీఆర్డీఏ అథారిటీ సమ్మతి తెలిపిందన్నారు. మంగళగిరి పట్టణానికి ప్రస్తుతం రోజుకు 30 మిలియన్ లీటర్లు(ఎంఎల్డీ)ప్రతి కిలో లీటర్ (కెఎల్డీ) రూ.10 చొప్పున ఇవ్వడానికి అనుమతి లభించిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భవిష్యత్తులో 80 ఎంఎల్డి నీరు ఆపట్టణానికి అవసరం ఉంటుందని తెలిపారు.డిస్ట్రిక్ కూలింగ్ సిస్టమ్ కు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు.మిక్స్ డ్ యూజ్ క్రింద ప్రైవేట్ వారికి భూమి ఇవ్వడానికి పిచ్చికలపాలెంలో 7.9 ఎకరాలు,తుళ్లూరులో 5ఎకరాలు,మందడంలో 12.38 మరియు 6 ఎకరాలు, కూరగల్లులో 6 ఎకరాలు ఇలా మొత్తం 42 ఎకరాలు సీఆర్డీఏ గుర్తించడం జరిగిందని వాటికి ఆర్ఎఫ్పి పిలవడానికి అనుమతి లభించిందన్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే నిబంధనల మేరకు కేటాయించిన భూమి కంటే ఎక్కువ కావాలని కోరుతున్నస్కూల్స్,హోటల్స్ తదితర సంస్థలకు ఎకరా ప్రాథమిక విలువ రూ.4.1 కోట్లు కంటే 250 శాతం ఎక్కువ అంటే సుమారు రూ. 10.25 కోట్లు చెల్లిస్తే వారికి ఆ భూమి అందించడానికి అనుమతి లభించిందన్నారు. రాజధానిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ డిమ్డ్ యూనిర్సిటీ నిర్మాణానికి 8.5ఎకరాలు కేటాయించేందుకు సిఆర్డిఏ అధారిటీ అనుమతిచ్చిందని చెప్పారు.అమరావతి రాజధాని ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ఐఓసీఎల్ తో ఎంఓయూ కుదుర్చుకోవడానికి సీఆర్డీఏకి అనుమతిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై రాజకీయం వద్దు

**-బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ,వేములవాడ:**

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను రాజకీయ కోణంలో చూడకుండా, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్, పలువరు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరగా,కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించినారు.ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై బీజేపీ నాయకులు అనవసర రాజకీయ విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంటే.. బీజేపీ నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, స్మార్ట్ రేషన్ కార్డులపై రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.తెలంగాణలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు సన్న బియ్యం పంపిణీ చేయడం లేదని నిలదీశారు. ముందుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం పంపిణీ చేసి చూపించాలని సవాల్ చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల వంటి పేదల సంక్షేమ కార్యక్రమాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శించడం మానుకోవాలని సూచించారు.తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్తున్న నిధులకు అనుగుణంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందా అని ప్రశ్నించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి నిధులు వెళ్తున్నాయని, కేంద్ర పథకాల అమలులో ఆయా రాష్ట్రాలముఖ్యమంత్రుల పాత్రను కూడా గుర్తించాలని అన్నారు.

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, చక్కెర ధరల పెరుగుదలపై కూడా కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యూరియా బుకింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్పై కూడా బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని అన్నారు .

బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రతి అంశాన్ని రాజకీయంగా మలచడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# నేత్రదానంతో అంధులకు చూపు ప్రసాదించొచ్చు

**బలగం టీవీ, సిరిసిల్ల**

మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా అంధులకు చూపును ప్రసాదించే గొప్ప అవకాశం లభిస్తుందని డిఎంహెచ్వో డాక్టర్ అంజెలా ఆల్ఫ్రెడ్ తెలిపారు. గురువారం 41వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నేత్రదానం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ.. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తులకు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థులు ప్రతిరోజూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అన్నారు . పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, జంక్ఫుడ్తో పాటు అధిక నూనె, ఉప్పు కలిగిన ఆహారాన్ని తగ్గించాలని సూచించారు.

నేత్రదానం పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకుని, తమ కుటుంబ సభ్యులు, సమాజంలోనూ దీనిపై చైతన్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా బ్లైండ్నెస్ కంట్రోల్ ప్రోగ్రామ్ అధికారి



నయీమ్ జహా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఐదు ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి..




**స్పందించకుంటే సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మహాధర్నాలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, కన్వీనర్ సయ్యద్ జబీర్ ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయ గేట్ ఆవరణలో జరిగిన ఈ ధర్నాకు గెజిటెడ్, నాన్గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే తాము అమలు చేయాలని కోరుతున్నామని, కొత్త డిమాండ్లు ఏవీ లేవని స్పష్టం చేశారు. ఉద్యోగుల ప్రధాన సమస్యలైన నూతన పీఆర్సీ ఏర్పాటు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, పెండింగ్లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయడం, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఉద్యోగులకు హెల్త్ కార్డుల జారీ చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులు వేల కోట్ల రూపాయలకు చేరుకోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. డీఏలు ఇంతకాలం పెండింగ్లో ఉండటం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన పరిణామమని అన్నారు.ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ అమలు కాలేదని , ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించి తదుపరి పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ

మహాధర్నాలో జేఏసీ నాయకులు గాజుల సుదర్శన్, బొల్లం సాగర్ , మెట్ట శ్రీకాంత్, మహమ్మద్ రియాజ్, జీ. శ్రీనివాస్ రావు , రాంనాథ్ రెడ్డి, మధుసూదన్ రావు, సదానందం , సుధాకర్ రెడ్డి , బాల్ రెడ్డి , రవీందర్ రెడ్డి, హరికిషన్ , నయీమొద్దీన్ , లాల శ్రీనివాస్ , మోతీలాల్ , పురుషోత్తం , క్రిష్ణప్రసాద్, కొమ్ము రమేష్, సాయికిరణ్, విశ్వాన్ , రామస్వామి , సురేష్ , ప్రవీణ్, అనిల్, మహేందర్ రావు, బి. శ్రీనివాస్ , శివసాయి,ఆర్. శేఖర్ , లక్ష్మణ్ తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్మాస్పూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు 120 హౌస్ డ్రెస్సుల పంపిణీ

**-ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు హైదరాబాద్కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పూదరి వెంకట్రాజం గౌడ్ అందజేసిన 120 హౌస్ డ్రెస్సులను గురువారం పాఠశాల ఆవరణలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ నాగెల్లి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. అడిగిన వెంటనే 120 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందజేసిన పూదరి వెంకట్రాజం గౌడ్ ఉదారతను కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి భవిష్యత్తులో తమవంతు సహకారం అందించాలని సూచించారు.

ఉప సర్పంచ్ కొర్రి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. అల్మాస్పూర్ గ్రామంపై, గ్రామ ప్రజలపై పూదరి వెంకట్రాజం, ఆయన కుటుంబం చూపిస్తున్న అభిమానాన్ని అభినందించారు. ఆయన కుటుంబం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరిచి ఉత్తమ పౌరులుగా ఎదగడం ద్వారా దాతకు కృతజ్ఞత తెలియజేయాలని సూచించారు.ప్రధానోపాధ్యాయులు పూదరి కుమారస్వామి మాట్లాడుతూ.. అల్మాస్పూర్ గ్రామ ప్రజల అనురాగం, ఆత్మీయతతో పాఠశాలకు అవసరమైన సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠశాలలో సమర్థవంతమైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని, రాబోయే ఎస్ఎస్సీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాలలో విశాలమైన తరగతి




గదులు, ఆట మైదానం, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, ఐఎఫ్పీ వంటి అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఇక్కడ ఉప సర్పంచ్ కొర్రి అనిల్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ పందిళ్ల శిరీష, వార్డు సభ్యురాలు నేరెళ్ల లత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ ఉపాధ్యాయులు పాశం వెంకట్రామ్ రెడ్డి, మైదం శెట్టి మల్లికార్జున్, కడదూరి మల్లారెడ్డి, సంపూర్ణ భవాని, పాశం భాస్కర్, ఆవునూరి ఆశ్రితతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాఖీ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి చీరల పంపిణీ



**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాఖీ పండుగను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా సిబ్బందికి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనగందుల నరసింహులు మహిళా సిబ్బందికి చీరలను అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర–సోదరీమణుల మధ్య ఉన్న ఆత్మీయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా సిబ్బందిని సోదరీమణులుగా భావించి రాఖీ పండుగ సందర్భంగా చీరలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం, ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో గ్రామపంచాయతీ సిబ్బంది మరింత సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తో పాటు వార్డు మెంబర్ బాలు, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, ఏటీసీల్లో వివిధ ట్రేడ్లలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ ప్రిన్సిపాల్ ఎస్. కవిత తెలిపారు. మొదటి, రెండో దశల్లో అడ్మిషన్ పొందలేకపోయిన విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ సిరిసిల్లలో హాజరై అడ్మిషన్ పొందాలని సూచించారు. ఐటీఐ/ఏటీసీలో వివిధ ట్రేడ్లలో శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అడ్మిషన్ కోసం ఎస్ఎస్సీ మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్, రెండు పాస్పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, శాశ్వత మొబైల్ నంబర్, ఈ-మెయిల్ చిరునామా తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులో ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ సిరిసిల్లలో సంప్రదించి స్పాట్ అడ్మిషన్ పొందాలని కోరారు.



# భూముల రీ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి..

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**బలగం టీవీ,ఇల్లంతకుంట**

భూ భారతి కింద భూముల రీ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామంలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, గురువారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించి.. అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్ అధికారులు సిబ్బంది ఉన్నారు.



# నూలు పౌర్ణమి ఉత్సవాలకు మున్సిపల్ చైర్పర్సన్కు ఆహ్వానం

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

నూలు పౌర్ణమి సందర్భంగా సిరిసిల్లలో నిర్వహించనున్న నూలు పౌర్ణమి ఉత్సవాలు, శ్రీ శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్రకు మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణిని సిరిసిల్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈ మేరకు పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్ ఆహ్వాన పత్రికను అందజేశారు.నూలు పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో, అలాగే సాయంత్రం 4 గంటల 5 నిమిషాలకు నిర్వహించనున్న శ్రీ శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్రలో పాల్గొనాలని చైర్పర్సన్ను కోరారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గాజుల బాలయ్య, మోర రవి, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, యువజన విభాగం అధ్యక్షుడు సబ్బని హరీష్, ఉపాధ్యక్షుడు గోరిట్యాల నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి వేముల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# జీపీ మోటార్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూం ప్రారంభం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని 12వ వార్డులో జీపీ మోటార్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూంను మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి ప్రారంభించారు.ఈ సందర్భంగా షోరూంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఎలక్ట్రిక్ స్కూటర్లను చైర్పర్సన్ పరిశీలించారు. వాటి పనితీరు, సాంకేతికత, వినియోగదారులకు అందించే సౌకర్యాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ

పెరుగుతున్న ఇంధన ధరలు, పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో ప్రజల్లో ఎలక్ట్రిక్ వాహనాలపై ఆదరణ పెరుగుతోందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల ఇంధన ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

సిరిసిల్ల ప్రజలకు నాణ్యమైన ఎలక్ట్రిక్ వాహనాలను అందించడంతో పాటు మెరుగైన సేవలు అందించాలని జీపీ మోటార్స్ నిర్వాహకులకు సూచించారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సేవలను అందుబాటులో ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు మొగిలి నాగరాజు, జీపీ మోటార్స్ నిర్వాహకులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, వాహన వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**-ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీక రక్షాబంధన్:**

**-కరస్పాండెంట్ పల్లె రాజు రెడ్డి**

**బలగం టీవీ,సిరిసిల్ల:**

సోదర–సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ప్రేమాభిమానాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పల్లె రాజు రెడ్డి మాట్లాడుతూ.. మనమందరం ఒకే కుటుంబ సభ్యులం. ఒకరికొకరం తోడుగా నిలబడి, ప్రేమతో, ఆప్యాయతతో, బాధ్యతతో ముందుకు సాగాలి అని అన్నారు. రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సందేశాలు అందించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# భక్తుల సౌకర్యార్థం దత్తక్షేత్రానికి బోట్ పునఃప్రారంభం

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా ప్రారంభం**
**బోట్‌లో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు**
**నిత్య పూజలకు బోట్ సౌకర్యం అందుబాటులోకి**
**భక్తులకు మరింత సులభమైన స్వామివారి దర్శనం**

బలగం టీవీ , బోయినిపల్లి



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయానికి నిత్య పూజలు, భక్తుల దర్శనాల కోసం బోట్ సౌకర్యాన్ని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోట్‌లో ప్రయాణించి, ఆలయానికి చేరుకున్నారు. అనంతరం శ్రీ దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వర(మిడ్ మానేరు) జలాశయం బ్యాక్‌వాటర్‌తో ఆలయం చుట్టూ నీరు చేరడంతో భక్తులు దర్శనానికి ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి, బోటు సేవలను పునరుద్ధరించారు. గతంలోనూ భక్తుల దర్శనార్థం బోట్ సౌకర్యం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బోట్ సౌకర్యం పునఃప్రారంభం కావడంతో ఆలయంలో నిత్య పూజలు సక్రమంగా కొనసాగడంతో పాటు స్వామివారిని దర్శించుకునే భక్తులకు ప్రయాణ సౌకర్యం కలగనుంది. భక్తుల భద్రతకు అవసరమైన లైఫ్ జాకెట్లు తదితర రక్షణ ఏర్పాట్లతో బోట్‌లో ఎమ్మెల్యే ప్రయాణించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యాన్ని, భక్తుల విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని, దత్తాత్రేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన సువిన్ యాదవ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## రక్షాబంధన్ వేడుకల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన..

**-హెల్మెట్ ధరించాలి.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల

రక్షాబంధన్ వేడుకల సందర్భంగా సిరిసిల్ల ట్రాఫిక్ పోలీసులు నేతాజీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొని, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఆర్ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. వేగంగా, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని,మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని అన్నారు .

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు తమ ప్రాణాలను, కుటుంబ సభ్యుల భద్రతను కాపాడుకోవచ్చని అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదర–సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీ కట్టడంతో పాటు రోడ్డు భద్రతపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అక్కచెల్లెళ్లు రక్షాబంధన్ సందర్భంగా తమ అన్నదమ్ములకు హెల్మెట్‌ను బహుమతిగా ఇచ్చి, వాహనం నడిపే ప్రతిసారీ హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించాలని ట్రాఫిక్ పోలీసులు పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుల భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు బాధ్యతగా పాటించాలని కోరారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి.

బలగం టీవీ, వేములవాడ:



వేములవాడ నియోజకవర్గం రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సదుల్లా హసీనా, రీమ్స్, హసీనా ఇటీవల జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు.

ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, కంటే రెడ్డి, గంగం మహేష్, దయ్యాల కమలాకర్, దయ్యాల నారాయణ, ఉప్పులూటి గణేష్, సింగారపు గంగారెడ్డి, కదాస్ లక్ష్మణ్, తర్రే గంగారెడ్డి, కోడిగంటి శ్యామ్, గంటె ప్రశాంత్, రగుట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## పెద్దూరు పాఠశాలలో ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి ఆప్యాయత, అనుబంధాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పండుగను జరుపుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఒకరికొకరు తోడునీడగా ఉంటూ, తరగతి గదిలోనూ, పాఠశాలలోనూ సోదరభావంతో మెలగాలని సూచించారు.

అనంతరం మహిళా ఉపాధ్యాయులు సైతం తమ తోటి ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి ఐక్యత, అనుబంధాన్ని చాటుకున్నారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని, కలిసిమెలిసి రక్షాబంధన్ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవితో పాటు ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, బైరివాణి శ్రీ, కడార్ల కల్పన, నందాల శంకర్, జనగాం రాజమల్లు, ఇరబోయిన రవికుమార్, రఘునందన్ రావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు..

**-డిఎంహెచ్వో డాక్టర్ ఆంజెలా ఆల్ఫ్రెడ్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డిఎంహెచ్వో డాక్టర్ ఆంజెలా ఆల్ఫ్రెడ్ అన్నారు.గురువారం సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలు, ఆసుపత్రుల నిర్వహణ తీరును పరిశీలించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆంజెలా ఆల్ఫ్రెడ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ఆంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అనుమతులు, రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు. ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన రుసుముల వివరాలను స్థానిక భాషలో రోగులకు, ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే వైద్యుల కన్సల్టేషన్ సమయాలు, వివరాలను కూడా అందరికీ కనిపించేలా బోర్డులపై ఏర్పాటు చేయాలని సూచించారు.రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తామని, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన సౌకర్యాలు అందేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు.



అదేవిధంగా స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పీసీపీఎన్‌డీటీ చట్టంలోని నిబంధనలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని,పుట్టబోయే శిశువు లింగ నిర్ధారణకు సంబంధించిన పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తిస్తే సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సెక్షన్ ఇన్‌చార్జ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి..




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యార్థుల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

**- సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..**
**- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన..**

ఈ కార్యక్రమల్లో భాగంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగం/మోసాలు,మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు

ఈ సందర్భంగా గురువారం రోజు ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవునూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకి అవగాహన కల్పించి, వేధింపులకు గురైతే వెంటనే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని షీ టీమ్ అధికారులు సూచించారు.

సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని , గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ముందడుగు వేస్తున్న ఎల్లారెడ్డిపేట

**- నూతన ఉత్సాహంతో పనులు చేపడుతున్న పాలకవర్గం**
**- ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా సర్పంచ్ నరసింహులు**

బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నూతన గ్రామపంచాయతీ పాలకవర్గం ముందుకు సాగుతోంది. గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తిస్తూ ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నారు.

అభివృద్ధి పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామంలోని ప్రతి గల్లీ, ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలన్న లక్ష్యంతో సర్పంచ్ ఎనగందుల నరసింహులు పనిచేస్తున్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

**గల్లీ గల్లీకి సీసీ రోడ్లు**

గ్రామంలోని అంతర్గత వీధుల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్ల కారణంగా ఏర్పడే బురద, గుంతలు, నీటి నిల్వలతో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులు చేపడుతున్నారు. సీసీ రోడ్లు పూర్తయితే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, ద్విచక్ర వాహనదారులు, రైతులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.



ప్రధాన రహదారులతో పాటు ప్రతి చిన్న గల్లీ కూడా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పాలకవర్గం పనులను ముందుకు తీసుకెళ్తోంది. బస్టాండ్ సమీపంలోని 11వ వార్డులో కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్డు పనులను చేపట్టడం పట్ల వార్డు సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న సర్పంచ్**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టడమే తన బాధ్యతగా భావిస్తూ సర్పంచ్ ఎనగందుల నరసింహులు అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తున్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేసే ప్రయత్నం చేస్తున్నారు.

"మాట ఇచ్చాం.. నిలబెట్టుకోవాలి.. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకూడదు" అనే లక్ష్యంతో పనిచేస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా ఉండాలన్నదే తన ఉద్దేశమని తెలిపారు.

**ప్రజలు సహకరిస్తే మరింత అభివృద్ధి**

గ్రామ అభివృద్ధి కేవలం సర్పంచ్ లేదా పాలకవర్గం బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం, సహకారం కూడా ఎంతో కీలకమని సర్పంచ్ నరసింహులు అన్నారు. ప్రజలు తమ సమస్యలను గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తే పనులను మరింత వేగంగా పూర్తి చేయగలమని తెలిపారు.

గ్రామంలోని ప్రతి ప్రాంతానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ఎవరూ అభివృద్ధికి దూరంగా ఉండకుండా చూడడమే తన లక్ష్యమన్నారు. ప్రజల అవసరాలు, గ్రామపంచాయతీ ప్రణాళిక, అభివృద్ధి పనుల మధ్య సమన్వయంతో ఎల్లారెడ్డిపేటను మరింత సుందరంగా, పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు.

"ప్రజల నమ్మకమే నా బలం.. ప్రజల సహకారమే నా అభివృద్ధి లక్ష్యానికి మార్గం. ఎల్లారెడ్డిపేట అభివృద్ధిలో ఇంకా ఎన్నో ముందడుగులు వేయాలి. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని సర్పంచ్ నరసింహులు కోరారు.



## వాణినికేతన్ హైస్కూల్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

బలగం, టీవీ ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణి నికేతన్ హై స్కూల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థినీలు ఉపాధ్యాయులకు రాఖీలు కట్టారు. ఫ్యాక్స్ చైర్మన్ వెంకట రమణారెడ్డి, తాసిల్దార్ రాచకట్ల సురేష్, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మామిడి రాజు తో పాటు పాలకవర్గ సభ్యులకు. పోలీస్ స్టేషన్లో ఎస్సై ఉపేంద్ర చారి తో పాటు సిబ్బందికి. ముస్కాన్ పేట సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డిలకు.ప్రభుత్వ ఆసుపత్రిలో, సహకార బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకులలో అధికారులకు విద్యార్థినిలు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా రాఖీలు కట్టడం యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి. ఉపాధ్యాయునీలు రేణుక, సుమంగళి, శోభ, కళ్యాణి, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, రేణుక, జలజ, శాంత, పద్మ, సునీత, స్వాతి, ఉషారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, రాజు, తిరుపతి లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫేక్ సమ్మెలు.. రియల్ పైరవీలు

## ఆటో సంఘాల ముసుగులో రాజకీయం..

**- ఉద్యమం పేరిట ఊరేగింపు.. తీరా సమయానికి 'రద్దు' విచిత్రం!**
**- డ్రైవర్ల సమస్యలు పక్కన.. సొంత పనులే మిన్న: జేఏసీ తీరుపై 'ఆటో' ఆగ్రహం!**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

"అదిగో పులి అంటే ఇదిగో తోక" అన్న చందంగా మారింది తెలంగాణ రాష్ట్రం లోని కొన్ని ఆటో యూనియన్ జేఏసీ నాయకుల తీరు. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలనే సాకుతో పదేపదే ఆందోళనలకు పిలుపునివ్వడం, చివరకు అధికారులతో చర్చల పేరుతో నాటకీయంగా వెనక్కి తగ్గడం పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉపాధి కోల్పోతూ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను పక్కనబెట్టి, సంఘాల ముసుగులో కొందరు నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం 'సమ్మె రాజకీయాలకు' తెరలేపుతున్నారనే ఆరోపణలు బలపడుతున్నాయి.

**మూడు సార్లు సమ్మె పిలుపు.. ఆపై రద్దు నాటకం!**

ఇప్పటివరకు సమస్యల పరిష్కారం పేరు చెప్పి మూడుసార్లు బంద్ కు పిలుపునిచ్చిన జేఏసీ నాయకత్వం, తీరా సమ్మె ప్రారంభమయ్యే కొద్ది గంటల ముందు "రద్దు" అంటూ ప్రకటనలు విడుదల చేయడాన్ని సామాన్య డ్రైవర్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. సమ్మె పిలుపుల ద్వారా ప్రభుత్వంపై, అధికారులపై ఒత్తిడి పెంచి తమ వ్యక్తిగత పైరవీలు చక్కబెట్టుకుంటున్నారని, అధికారులు నిరాకరించినప్పుడు మాత్రమే సమ్మె అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తవ్వగానే అంతా సర్దుమణిగిందంటూ సమ్మెను రద్దు చేయడం వెనుక పెద్ద వ్యూహమే నడుస్తోందని ఆటో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**డ్రైవర్ల ఆవేదన: "స్వార్థ నేతలకు తగిన బుద్ధి చెప్తాం"**

ఇష్టం వచ్చినప్పుడు సమ్మెకు పిలుపునివ్వడం, మళ్లీ వెనక్కి తగ్గడం సరైన పద్ధతి కాదు. ఆటో రంగంలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రభుత్వం రెండేళ్ల కిందటే హామీ ఇచ్చింది. ఇప్పటివరకు ఆ హామీలు నెరవేరలేదు. అలాంటప్పుడు ప్రతిసారీ సమ్మె అంపశయ్యపై పెట్టి వెనక్కి తగ్గడం వెనుక అంతరార్థం ఏమిటి? సామాన్య డ్రైవర్ల కష్టాలను అమ్ముకుని కొందరు జేఏసీ నేతలు పైరవీలు చేసుకుంటున్నారు. ఆటో డ్రైవర్లను సమిధలుగా మారుస్తున్న ఇటువంటి నాయకులకు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతాం.

- ముష్కం శ్రీధర్, ఆటో డ్రైవర్ సిరిసిల్ల (ఎల్లారెడ్డిపేట)..



# శ్రీలంక పోరాటం.. ఆఖరి టెస్టు డ్రా

**సోనాల్ దినుషా అజేయ సెంచరీ (133 నాటౌట్)**
**ఓటమి అంచుల నుంచి గట్టెక్కిన లంక**
**సిరీస్ 1-0తో భారత్ వశం**

బలగం టీవీ, కొలంబో

విజయం ఖాయమనుకున్న చోట టీమిండియాకు నిరాశ ఎదురైంది. శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ అనూహ్యంగా డ్రాగా ముగిసింది. లంక యువ బ్యాటర్ సోనాల్ దినుషా (264 బంతుల్లో 133 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుత పోరాటానికి తోడు టెయిలెండర్లు సహకరించడంతో ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో శ్రీలంక ఘనంగా నిలబడింది. మ్యాచ్ డ్రా అయినా.. రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.

మొండి పట్టుదలతో.. ఆఖరి రోజు 229/6 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట ప్రారంభించిన లంక.. భారత్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. తొలి సెషన్‌లోనే మ్యాచ్ ముగుస్తుందని భావించిన టీమిండియా ఆశలపై దినుషా, కేశర నువాంత (150 బంతుల్లో 46) నీళ్లు చల్లారు. భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెడుతూ ఏడో వికెట్‌కు 112 పరుగులు జోడించారు. పసింధు సూర్యబండార (92), కామిందు మెండీస్ (55) కూడా ఉపయోగపడే పరుగులు చేశారు.

లంచ్ తర్వాత కాస్త ఆశలు.. కానీ! రెండో సెషన్‌లో నువాంతతో పాటు ప్రభాత్ జయసూర్య కూడా త్వరగానే నిష్క్రమించడంతో భారత్ శిబిరంలో మళ్లీ ఆశలు చిగురించాయి. అయితే, లాహిరు కుమారతో కలిసి దినుషా మళ్లీ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. 196 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న దినుషా.. జట్టును సురక్షిత తీరానికి చేర్చాడు. 67 ఏళ్ల తర్వాత భారత్‌పై ఈ రకమైన ప్రదర్శనతో సోనాల్ దినుషా అరుదైన ఘనత సాధించాడు.



లంక రెండో ఇన్నింగ్స్‌లో 154 ఓవర్లలో 429/9 స్కోరు వద్ద నిలవగా, ఆడేందుకు తగిన సమయం లేకపోవడంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ (3/121), రవీంద్ర జడేజా (3/94) మూడేసి వికెట్లు తీశారు.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 503/9 డిక్లేర్డ్ (పడిక్కల్ 117, ధ్రువ్ జురెల్ 115 నాటౌట్)

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 290 ఆలౌట్ (దినుషా 103, సూర్యబండార 80)

శ్రీలంక రెండో ఇన్నింగ్స్: 429/9 డిక్లేర్డ్ (దినుషా 133 నాటౌట్, సూర్యబండార 92; జడేజా 3/94, సుతార్ 3/121)

# ఇక భారత్ ప్రతి మ్యాచ్ గెలవాల్సిందే!




**WTC ఫైత్ రేసుపై తీవ్ర ప్రభావం**

బలగం టీవీ, కొలంబో

విజయం ఖాయమనుకున్న మ్యాచ్‌లో టీమిండియా బౌలర్లు చేతులెత్తేయడంతో శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు అనూహ్యంగా డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లోని వైఫల్యం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) 2027 ఫైనల్ రేసులో భారత్‌ను దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి దూసుకెళ్లే భారత్.. ప్రస్తుతం 51.52 శాతంతో ఐదో స్థానంలోనే నిలిచిపోయింది.

ఇక ప్రతి మ్యాచ్ గెలవాల్సిందే!

డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కాలంటే భారత్ ఇకపై ఆడే ఏడు టెస్టుల్లోనూ (న్యూజిలాండ్‌తో 2, ఆస్ట్రేలియాతో 5) విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలిస్తే టీమిండియా విజయాల శాతం 68.52కి చేరుతుంది. ఒకవేళ ఓటములు ఎదురైతే పర్సంటేజీ పడిపోయి ఫైనల్ అవకాశాలు సంక్లిష్టమవుతాయి.

# ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌లకు వన్డే జట్టులో చోటు

## ఆస్ట్రేలియా సిరీస్‌కు భారత్ అండర్-19 జట్టు ప్రకటన..

**వన్డేల కెప్టెన్‌గా లక్ష్య రాయ్‌చందాని, వైస్ కెప్టెన్‌గా యశ్‌బర్ధన్**
**సెప్టెంబర్ 18 నుంచి సిరీస్ ప్రారంభం**

బలగం టీవీ, హైదరాబాద్

ఆస్ట్రేలియా అండర్-19 జట్టు భారత పర్యటనకు సంబంధించి బీసీసీఐ గురువారం జట్లను ప్రకటించింది. ఈ ఎంపికలో భారత క్రికెట్ దిగ్గజాలు వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్‌ల కుమారులు ఒకే జట్టులో స్థానం సంపాదించడం విశేషంగా నిలిచింది. 18 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్, 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ ఇద్దరూ 15 మంది సభ్యులతో కూడిన వన్డే జట్టుకు ఎంపికయ్యారు.

ఆర్యవీర్‌కు తొలి అవకాశం.. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రాణిస్తూ ఆకట్టుకున్న టాప్ ఆర్డర్ బ్యాటర్ ఆర్యవీర్ సెహ్వాగ్‌కు భారత్ అండర్-19 జట్టు నుంచి పిలుపు రావడం ఇదే తొలిసారి. తండ్రి సెహ్వాగ్ లాగే ఆక్రమణ శైలితో ఆడే ఆర్యవీర్‌కు ఆస్ట్రేలియాపై ఆడటం కెరీర్‌లో అతిపెద్ద పరీక్ష కానుంది.

అన్వయ్‌కు ఇప్పటికే అనుభవం.. వికెట్ కీపర్ బ్యాటర్ అయిన అన్వయ్ ద్రవిడ్‌కు గతంలోనూ యూత్ వన్డేలు ఆడిన అనుభవం ఉంది. శ్రీలంక పర్యటనలో క్లిష్ట సమయంలో (87 పరుగులు) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోవడంతో సెలెక్టర్లు అతడిని కొనసాగించారు. ఈ సిరీస్‌లో రాజత్ బఘేల్‌తో పాటు అన్వయ్ రెండో వికెట్ కీపర్‌గా అందుబాటులో ఉన్నాడు.

రాజ్‌కోట్, అహ్మదాబాద్ వేదికలుగా మ్యాచ్‌లు ఈ పర్యటనలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా జట్లు 3 వన్డేలు, 2 మల్టీ డే మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. వన్డే జట్టుకు లక్ష్య రాయ్‌చందాని కెప్టెన్‌గా, మల్టీ డే జట్టుకు యశ్‌బర్ధన్ చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

షెడ్యూల్ వివరాలు:





1వ వన్డే: సెప్టెంబర్ 18 (రాజ్‌కోట్)
2వ వన్డే: సెప్టెంబర్ 21 (రాజ్‌కోట్)
3వ వన్డే: సెప్టెంబర్ 23 (రాజ్‌కోట్)
1వ మల్టీ డే మ్యాచ్: సెప్టెంబర్ 27 - 30 (రాజ్‌కోట్)
2వ మల్టీ డే మ్యాచ్: అక్టోబర్ 5 - 8 (అహ్మదాబాద్)

# చిందు సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం.. ఆత్మగౌరవ సాధనకు చారిత్రక అడుగు



**-2025లో గ్రామస్థాయిలో ఎన్నికైన చిందు ప్రజాప్రతినిధులకు ఘన సన్మానోత్సవం**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చిందు సమాజం అనే కార్యక్రమంలో భాగంగా గడ్డం దేవదాస్ వర్ధంతి సందర్భంగా 2025లో గ్రామస్థాయిలో ఎన్నికైన చిందు ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం చేశారు.

శతాబ్దాలుగా సామాజిక అంచుల్లో జీవిస్తూ, తరతరాలుగా తమ సాంస్కృతిక కళా సంపదను కాపాడుకుంటూ వచ్చిన చిందు సమాజం నేడు ఆత్మగౌరవం, సామాజిక సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం దిశగా చారిత్రక అడుగు వేస్తోంది. 2025 సంవత్సరంలో తెలంగాణలో గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో చిందు సమాజానికి చెందిన పలువురు పోటీ చేసి, కొందరు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం సామాజిక మార్పుకు తొలి అడుగుగా నిలిచింది.

ఈ సందర్భంగా 2025లో గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన చిందు సమాజానికి చెందిన వారిని ఘనంగా సన్మానించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిందు సమాజ నాయకులు తెలిపారు.

చిందు సమాజ జీవితం ఒకప్పుడు యక్షగానం, జాంబవంతుని చరిత్ర, పురాణ గాథలను ప్రజలకు అందించే కళా సంప్రదాయంతో ముడిపడి ఉండేది. కళ ద్వారా సమాజాన్ని చైతన్యపరిచిన చిందు కళాకారులు ప్రతిఫలంగా లభించిన ధాన్యం, కొద్దిపాటి ఆదాయం, సామాజిక సహకారంతో జీవనం సాగించేవారు. కాలక్రమేణా సంప్రదాయ కళావృత్తికి ఆదరణ తగ్గడంతో అనేక కుటుంబాలు పెయింటింగ్, డ్రైవింగ్, హోటల్ కార్మికులు, పండ్ల వ్యాపారం, చిన్న వ్యాపారాలు, దినసరి కూలి తదితర వృత్తులపై ఆధారపడాల్సి వచ్చింది.

కొన్ని కుటుంబాలు స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నప్పటికీ, స్థిరమైన అభివృద్ధి మాత్రం ఇంకా అందని ద్రాక్షగానే ఉందని నాయకులు పేర్కొన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యవసాయ భూమి, గృహాలు, సంక్షేమ పథకాలు, ఆర్థిక అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అనేక సమస్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

“మా కళను సమాజం తీసుకుంది... మరి మా కళాకారుడికి ఏమిచ్చింది?” అనే ప్రశ్నను వారు లేవనెత్తారు. చిందు యక్షగానం దేశ సాంస్కృతిక సంపదలో భాగమైనప్పటికీ, ఆ కళను తరతరాలుగా మోసిన కళాకారుల జీవితాల్లో పేదరికం కొనసాగడం బాధాకరమన్నారు. కళాకారులను కేవలం సహాయం పొందాల్సిన వారిగా కాకుండా దేశ సాంస్కృతిక సంపదకు సంరక్షకులుగా గుర్తించాలని కోరారు. కళకు గుర్తింపు ఇవ్వడం దానం కాదని, చరిత్రకు న్యాయం చేయడమని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు అమలు చేస్తున్న భూ పంపిణీ, ఉపాధి, ఎస్సీ కార్పొరేషన్, గృహ నిర్మాణం, విద్య, సంక్షేమ పథకాలు తదితర ప్రయోజనాలు చిందు సమాజానికి పూర్తిస్థాయిలో చేరడం లేదని నాయకులు అన్నారు. పథకాలపై అవగాహన లేకపోవడం, ఆర్థిక బలహీనత, అధికార వ్యవస్థను చేరుకోలేకపోవడం వంటి కారణాలతో అనేక కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నాయని తెలిపారు. అందువల్ల చిందు సమాజానికి ప్రత్యేక అవగాహన, మార్గదర్శక, సహాయక వ్యవస్థ అవసరమని డిమాండ్ చేశారు.

రాజకీయ ప్రాతినిధ్యమే గొంతుకు బలం..

“మన గురించి నిర్ణయం తీసుకునే టేబుల్ దగ్గర మన మనిషి లేకపోతే మన సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు?” అని నాయకులు ప్రశ్నించారు. రాజకీయ ప్రాతినిధ్యం ఒక పదవి కోసం పోటీ కాదని, తమ హక్కుల కోసం గొంతు వినిపించే సాధనమని అన్నారు.

నిన్నటి వరకు గ్రామం చివరన నిలబడి అధికార కార్యక్రమాలను చూసిన వ్యక్తి, నేడు గ్రామ నిర్ణయాలు జరిగే వేదికలో కూర్చోవడం చారిత్రక పరిణామమని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక పదవి కాదని, భవిష్యత్ తరాల కోసం తెరుచుకున్న తలుపు అని అభివర్ణించారు. గెలిచినవారితో పాటు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన చిందు అభ్యర్థుల వెనుక కూడా ఒక చరిత్ర, ఒక కళ, ఒక పేదరికం, ఒక పోరాటం, ఒక తరం కన్నీరు, మరో తరానికి ఒక కల ఉందన్నారు.

గడ్డం దేవదాసు ఆశయ సాధనకు పిలుపు..

చిందు సమాజానికి దిశానిర్దేశం చేస్తూ సామాజిక చైతన్యానికి కృషి చేసిన గడ్డం దేవదాసు సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. అనారోగ్యంతో ఉన్న సమయంలోనే చిందు సమాజంతో మమేకమై, సమాజ అభివృద్ధి కోసం పలు మార్గదర్శకాలను సూచించారని తెలిపారు. “చిందు సామాజిక దృక్పథం” వంటి రచనల ద్వారా సమాజంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని, ప్రజా సంఘాలకు, సామాజిక వర్గాలకు కరపత్రాలు, వ్యాసాల ద్వారా తన వంతు సేవ అందించారని గుర్తుచేశారు.

ఉద్యమ పోరాటం కొనసాగుతున్న సమయంలోనే గడ్డం దేవదాసు అమరత్వం పొందడం చిందు సమాజానికి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

ఒకే సంఘం – ఒకే జెండా – ఒకే అజెండా

చిందు సమాజంలో ఉన్న వివిధ సంఘాలు, వేదికలు తమ విభేదాలను పక్కనపెట్టి **“ఒకే సంఘం – ఒకే జెండా – ఒకే అజెండా”**తో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. యువత, మహిళలు, కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజాప్రతినిధులను సంఘటితం చేసి సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం కృషి చేయాలని కోరారు.

కళను కాపాడుకోవడం, విద్యను పెంచడం, ఉద్యోగ–ఉపాధి అవకాశాలను సాధించడం, ఇళ్లు, వ్యవసాయ భూమి, సంక్షేమ పథకాలు పొందడం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడం తమ ప్రధాన లక్ష్యాలని తెలిపారు.

“మాకు దానం వద్దు – అవకాశం కావాలి.
మాకు మాటలు వద్దు – ప్రాతినిధ్యం కావాలి.
మా పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలి.
మా కుటుంబాలకు భద్రత కావాలి.
ఈ సమాజంలో అందరికీ ఉన్న హక్కుల్లో మాకూ సమాన భాగం కావాలి.” అని నాయకులు స్పష్టం చేశారు.

ఒకప్పుడు చిందు సమాజం చేతిలో కళ మాత్రమే ఉండేదని, నేడు ఓటు కూడా ఉందని, ఆ ఓటును హక్కుల సాధనకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. చిందు కళాకారుడి గొంతు ఇక యక్షగాన వేదికపైనే కాకుండా గ్రామసభలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రజా నిర్ణయ వేదికల్లోనూ వినిపించాలని ఆకాంక్షించారు. “మేము చరిత్రను కేవలం చెప్పిన వాళ్లం కాదు... ఇక నుంచి మా చరిత్రను మేమే నిర్మించబోతున్న వాళ్లం.” అని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 2025లో ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన చిందు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను అభినందించి భవిష్యత్ రాజకీయ, సామాజిక కార్యక్రమాలకు మార్గదర్శనం చేయనున్నట్లు తెలిపారు.



# యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఛాంపియన్‌గా ముచోవా-మెన్సిక్!

**ఫైనల్లో కొబొలి-బెన్‌చిచ్ జోడీపై విజయం**
**చెక్ రిపబ్లిక్ జంటకు గ్రాండ్‌స్లామ్ టైటిల్**

బలగం టీవీ, హైదరాబాద్

ప్రతిష్ఠాత్మక యూఎస్ ఓపెన్ టోర్నీలో చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ముచోవా - జాకబ్ మెన్సిక్ జోడీ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

ఆర్థర్ ఆషే స్టేడియంలో గురువారం రాత్రి జరిగిన హోరాహోరీ ఫైనల్ పోరులో ముచోవా-మెన్సిక్ జంట 6-3, 1-6, 10-6 (సూపర్ టైబ్రేక్) తేడాతో నాలుగో సీడ్ ఫ్లావియో కొబొలి (ఇటలీ) - బెలిందా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) ద్వయంపై సంచలన విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది.

తొలి సెట్‌ను సులువుగా చేజిక్కించుకున్న ముచోవా-మెన్సిక్ జోడీ.. రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి తీవ్ర నిరోధం ఎదురవ్వడంతో వెనకబడింది. అయితే నిర్ణయాత్మక సూపర్ టైబ్రేక్‌లో ఒత్తిడిని జయించి వరుస పాయింట్లతో విజయాన్ని ఖాయం చేసుకుంది.



# భారత్-అఫ్గన్ సిరీస్ ప్రసార హక్కులు పాక్ కంపెనీకి!

**గ్లోబల్ మీడియా రైట్స్ దక్కించుకున్న 'ట్రాన్స్‌గ్రూప్'**
**స్పష్టం చేసిన అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు**
**భారత్‌లో సోనీ స్పోర్ట్స్, ఫ్యాన్‌కోడ్‌ల్లో లైవ్**

బలగం టీవీ, హైదరాబాద్

భారత్, అఫ్గనిస్థాన్ మధ్య సెప్టెంబర్‌లో జరగనున్న చారిత్రాత్మక టీ20 సిరీస్ ప్రసార హక్కులను పాకిస్థాన్‌కు చెందిన 'ట్రాన్స్‌గ్రూప్' (TransGroup) కంపెనీ కైవసం చేసుకుంది. ఈ సిరీస్ వాణిజ్య, గ్లోబల్ మీడియా ప్రసార బాధ్యతలను సదరు సంస్థకు అప్పగిస్తూ అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు (ACB) నిర్ణయం తీసుకుంది.

అభ్యంతరం చెప్పని బీసీసీఐ! సాధారణంగా టీమిండియా సిరీస్‌ల ప్రసార హక్కులు జియో స్టార్ లేదా సోనీ స్పోర్ట్స్ దక్కించుకుంటాయి. అయితే ఏసీబీకి 'గ్లోబల్ మీడియా రైట్స్ సిండికేట్ భాగస్వామి'గా ఉన్నందునే ట్రాన్స్‌గ్రూప్‌కు ఈ హక్కులు లభించాయి. హోస్ట్ బోర్డుగా ఏసీబీ తీసుకున్న ఈ నిర్ణయానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) కూడా ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు.

భారత్‌లోనే మ్యాచ్‌లు.. ఇరుజట్ల మధ్య ఇది మొదటి ద్వైపాక్షిక టీ20 సిరీస్ అయినప్పటికీ, మ్యాచ్‌లు మాత్రం భారత వేదికగానే జరగనున్నాయి. మన దేశంలో ఈ మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్, ఫ్యాన్‌కోడ్ వేదికలు ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాయి.

షెడ్యూల్ వివరాలు:
తొలి టీ20: సెప్టెంబర్ 13
రెండో టీ20: సెప్టెంబర్ 15
మూడో టీ20: సెప్టెంబర్ 17

# ఫాలో-ఆన్ నిర్ణయం తప్పు కాదు.. శ్రీలంక ప్రదర్శనతోనే డ్రా

**శుభ్‌మన్ గిల్**
**శ్రీలంక బ్యాటర్ల పోరాటం వల్లే గెలవలేకపోయాం**
**అన్ని విషయాల్లోనూ సానుకూలంగానే ఉన్నాం**
**WTC ఫైనల్ చేరుతామన్న ధీమా వ్యక్తం చేసిన టీమిండియా కెప్టెన్**



బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ డ్రా కావడానికి తాము తీసుకున్న ఫాలో-ఆన్ నిర్ణయం కారణం కాదని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన ఆయన.. ప్రత్యర్థి బ్యాటర్ల అద్వితీయ పోరాటంతోనే భారత్ విజయాన్ని అందుకోలేకపోయిందని అభిప్రాయపడ్డాడు.

శ్రీలంకకు అదృష్టం కలిసి వచ్చింది! "నిజాయితీగా చెప్పాలంటే విజయం సాధించడానికి మేము చేయాల్సిందంతా చేశాం. మూడు రోజుల పాటు మైదానంలో నిరంతరం శ్రమించాం. కానీ శ్రీలంక బ్యాటర్లు ఒత్తిడిలోనూ అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి మ్యాచ్‌ను కాపాడుకున్నారు. వారికి కాస్త అదృష్టం కూడా తోడైంది. పరిస్థితులను బట్టే ఫాలో-ఆన్ ఆడించాలని నిర్ణయించుకున్నాం, ఇప్పుడు ఆలోచిస్తే అది తప్పనిపించవచ్చు కానీ మ్యాచ్ ఫలితం డ్రా అయినా టెస్ట్ క్రికెట్ గెలిచింది" అని గిల్ వ్యాఖ్యానించాడు.

యువ ఆటగాళ్లపై ప్రశంసలు ఈ మ్యాచ్‌లోని అనేక సానుకూల అంశాలను కెప్టెన్ ప్రస్తావించాడు. దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ బ్యాటింగ్‌తో పాటు యంగ్ స్పిన్నర్ మానవ్ సుతార్ బౌలింగ్ తీరును ప్రత్యేకంగా ప్రశంసించాడు. మానవ్ నిలకడైన ప్రదర్శన ఆకట్టుకుందని, భవిష్యత్తులో అతను జట్టుకు కీలక బౌలర్‌గా మారతాడని ధీమా వ్యక్తం చేశాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్‌పై నమ్మకం ముందున్న న్యూజిలాండ్ పర్యటన, ఆ తదుపరి స్వదేశీ సిరీస్‌లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తామని గిల్ పేర్కొన్నాడు. తమపై తమకు పూర్తి నమ్మకం ఉందని, కచ్చితంగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) ఫైనల్ బెర్త్ దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశాడు.

# టెయిలెండర్ల సహకారంతోనే అద్భుత ప్రదర్శన

**శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినుషా**

బలగం టీవీ, హైదరాబాద్

భారత్‌తో కొలంబో వేదికగా గురువారం ముగిసిన రెండో టెస్టులో అజేయ శతకంతో శ్రీలంకను ఓటమి నుంచి గట్టెక్కించిన బ్యాటర్ సోనాల్ దినుషా తన ప్రదర్శనకు టెయిలెండర్ల సహకారమే కారణమని తెలిపాడు. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు సాధించిన దినుషా.. రెండో ఇన్నింగ్స్‌లో 264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 133 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని జిడ్డు బ్యాటింగ్‌తో భారత విజయావకాశాలకు గండిపడింది.

కోచ్‌లు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు

అద్భుత ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న దినుషా.. తన ఎదుగుదలకు సహకరించిన కోచ్‌లు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను గుర్తు చేసుకున్నాడు. తన స్కూల్ కోచ్, ప్రావిన్షియల్ కోచ్‌తో పాటు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నాడు.

గాలే టెస్టుతో పాటు కొలంబో మ్యాచ్‌కు ముందు చేసిన సన్నద్ధత తన ప్రదర్శనకు ప్రధాన కారణమని తెలిపాడు. శ్రీలంక పిచ్‌లు స్పిన్‌కు అనుకూలంగా ఉంటాయనే విషయం ముందే తెలుసుకుని అందుకు అనుగుణంగా సాధన చేసినట్లు చెప్పాడు.

టెయిలెండర్ల సహకారంతోనే..

తమ టెయిలెండర్లు కూడా ఎంతో బాగా సహకరించారని దినుషా తెలిపాడు. వారు ధైర్యంగా ఆడటం వల్లే తాను ఎక్కువ పరుగులు చేయగలిగానని పేర్కొన్నాడు. పరిస్థితులను అర్థం చేసుకుని జట్టు అవసరాలకు అనుగుణంగా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించానని చెప్పాడు.

ఈ సిరీస్‌లో మూడు సెంచరీలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని, జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు పరుగులు సాధించడమే తన లక్ష్యమని తెలిపాడు. ఆ లక్ష్యాన్ని సాధించగలిగినందుకు ఆనందంగా ఉందన్నాడు.

భారత్‌పై అరుదైన ఘనత

తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగులు చేసిన సోనాల్ దినుషా.. రెండో ఇన్నింగ్స్‌లో 133 పరుగులతో అజేయంగా నిలిచాడు. అంతకుముందు తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో 100, 84 పరుగులు చేశాడు. దీంతో భారత్‌పై తొలి నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనూ 50కిపైగా పరుగులు సాధించిన తొలి ఆసియా బ్యాటర్‌గా దినుషా అరుదైన ఘనత సాధించాడు.

# ఇరుముడికి ఫ్యామిలీ ఆడియెన్స్ బ్రహ్మారథం




## కలెక్షన్లలో వందకోట్ల క్లబ్బుకు చేరిన మూవీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ సినిమా కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందు కుంది. రవితేజ కెరీర్‌లో అత్యంత వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిన చిత్రంగా 'ఇరుముడి' నిలిచింది. చాలా కాలంగా ఒక భారీ కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు ఈ చిత్రం కెరీర్‌లోనే ప్రత్యేకమైన విజ యాన్ని అందించిందని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. సాధారణం గా వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చే మొదటి సోమవారం చాలా సినిమాల బుకింగ్స్, ఆక్యుపెన్సీలు తగ్గడం సహజం. కానీ 'ఇరుముడి' విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపించింది. విడుద లైన నాలుగో రోజు కూడా సినిమా బుకిం గ్స్ బలంగా కొనసాగడంతో ట్రేడ్ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. మొదటి రోజు స్థాయికి దగ్గరగా బుకింగ్స్ నమోద వడం 'ఇరుముడి'పై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. రీజినల్ సినిమా ల్లో ఫస్ట్ మండే బుకింగ్స్ పరంగా కూడా ఈ చిత్రం కొత్త రికార్డులు నమో దు చేసినట్లు తెలుస్తోంది. 'ఇరుముడి' హవా టికెట్ సేల్స్‌లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో కేవలం నాలుగు రోజుల్లోనే 38 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. భారీ స్థాయిలో ప్రేక్షకులు థియేటర్లకు తరలిరావడంతో అనేక ప్రాం తాల్లో షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. ఏపీ, తెలం గాణలోని పలు ప్రధాన కేంద్రాల్లో ఇప్ప టికే హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తు న్నాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి సినిమాకు మంచి స్పందన రావడం చిత్రా నికి పెద్ద ప్లస్‌గా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి నాలుగు రోజు ల్లో రూ.100 కోట్ల గ్రాస్ మైలురాయిని చేరుకున్న 'ఇరుముడి' ఇప్పుడే తన రికా ల వేటను ప్రారంభించినట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఇంకెన్ని అరుదైన రికార్డులు తన ఖాతాలో వేసుకుంటుందో చూడాలి.

# CINEMA




# టాక్సిక్ టిక్కెట్ రేట్ల పెంపునకు తెలంగాణలో అనుమతి

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'కు తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోమ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్లలో జీఎస్టీతో కలుపుకుని రూ. 50, అలాగే మల్టీప్లెక్స్‌లు మరియు స్పెషల్ థియేటర్లలో రూ. 100 వరకు అదనంగా టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చారు. పెంచిన ధరలు సినిమా విడుదలైన రోజు నుంచి సెప్టెంబర్ 4 వరకు పది







రోజుల పాటు అమలులో ఉంటాయి. అలాగే ఈ పది రోజుల పాటు రోజుకు అదనంగా ఒక షోతో కలుపుకుని మొత్తం 5 షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ధరల పెంపుతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను కూడా ఖరారు చేసింది. సినీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌కు నిర్మాణ సంస్థ 'కేవీఎన్-మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్‌ఎల్‌పీ' తక్షణమే రూ. 1 కోటి విరాళంగా అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులను పూర్తిగా సినీ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయనున్నారు. అలాగే, సినిమా ప్రదర్శన సమయంలో మాదకద్రవ్యాలు, నార్కోటిక్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రకటనలను తప్పనిసరిగా ప్రదర్శించాలని థియేటర్ల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలన్నీ ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు మరియు సినిమా లైసెన్సింగ్ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. టాక్సిక్' చిత్రాన్ని తెలంగాణలో ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు, ఎఫ్.డి.సి. ఛైర్మన్ దిల్ రాజు విడుదల చేస్తున్నారు.

# దేశ విభజన నేపథ్యంలో బట్వారా 1947




## పేలవ ప్రదర్శనతో ఆకట్టులోకపోయిన చిత్రం

సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలువచ్చాయి.ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు. అయితే 'బట్వారా' నష్టాలు రాబోయే రోజుల్లో భర్తీ అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# నటనను నీ నుంచి నేర్చుకోవాల్సిందే

## బేబీ నక్షత్రకు నటుడు ధనుష్ ప్రశంసలు



'ఇరుముడి' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని కథ, భావోద్వేగ సన్నివేశాలు, నటీనటుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రవితేజ నటనతో పాటు ఆయన కుమార్తె పాత్రలో నటించిన బాలనటి బేబీ నక్షత్ర నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. తండ్రి-కూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని తెరపై ఎంతో భావోద్వేగంగా చూపించడంలో ఈ ఇద్దరి నటన కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇరుముడి' సక్సెస్ మీట్ తర్వాత దర్శకుడు శివ నిర్వాణ బేబీ నక్షత్రకు ఒక ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటుడు ధనుష్‌తో నక్షత్రకు వీడియో కాల్ ఏర్పాటు చేశారు. సినిమాలో ఆమె నటనను చూసిన ధనుష్ చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వీడియో కాల్‌లో ధనుష్ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నక్షత్ర నటనను ప్రశంసిస్తూ, ఎప్పుడైనా ఇద్దరం కలిసినప్పుడు 'నేను నీ దగ్గర నటన నేర్చుకోవాలి' అంటూ సరదాగా చెప్పారు.. ఒక స్టార్ హీరో, జాతీయ అవార్డు విజేత నుంచి ఇలాంటి ప్రశంసలు రావడంతో నక్షత్ర ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.ధనుష్‌తో జరిగిన ఈ ప్రత్యేక సంభాషణను బేబీ నక్షత్ర తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. దీంతో ఈ వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షించి వైరల్‌గా మారింది. చిన్నారి నటనకు ధనుష్ లాంటి స్టార్ నుంచి ప్రశంసలు రావడంపై అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఇరుముడిలో నక్షత్ర నటన నిజంగానే అద్భుతం , ధనుష్ ప్రశంసలు ఆమెకు మరింత ప్రోత్సాహం ఇస్తాయి అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో బేబీ నక్షత్ర పాత్ర కథలో కీలకంగా నిలిచిందని ప్రేక్షకులు చెబుతున్నారు.

# బికినీలో కృతిసనన్ రక్షాబంధన్ సెలబ్రేషన్స్



## ఏకి పడేసిన నటి, ఎంపి కంగనా రనౌత్

కృతి సనన్ ఇటీవల నటించిన ఓ యాడ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పటికే నెట్టింట విమర్శలు రాగా.. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తాజాగా మండిపడ్డారు. రక్షా బంధన్ అంటే ప్రతి సోదరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. అంత గొప్ప సమయంలో హుందాగా కనిపించాలి. ఈ సాంప్రదాయ పండగకు సంబంధించిన ప్రకటనలో ఇలాంటి దుస్తులా ధరించేది. ఈ రోజుల్లో మహిళలకు లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్, చీరలు, పంజాబీ డ్రెస్‌లు.. ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా.. ఇలాంటి బికినీ ధరించి రాఖీ ఎందుకు కడతారు?. ఈ యాడ్ చేసిన స్టైలిస్ట్‌కు ఈ ఆప్షన్లు కనిపించలేదా? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగా చేసినట్లుంది. చాలా అసహ్యంగా కనిపిస్తోందని తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. ఇటీవల విడుదలైన ఈ యాడ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కృతిని ట్రోల్ చేస్తున్నారు. డ్రెస్‌తో పాటు.. ఈ యాడ్‌లో పెంపుడు కుక్కకు రాఖీ కడుతూ కృతి కనిపించడంతో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. ఈ యాడ్‌పై ఇప్పటి వరకూ యాజమాన్యం, కృతి సనన్ స్పందించలేదు.

